ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కుమరం భీం
జిల్లా వార్తలు
8
బుధవారం 17 సెప్టెంబరు 2025


మిలటరీ శిక్షణ క్యాంపులో సాయుధ శిక్షణ పొందిన ఆసిఫాబాద్ యువకులు (ఫైల్)

తెలంగాణ విమోచనంలో జిల్లా యోధులు

- నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం
- ఏడాది పాటు మిలటరీ శిక్షణ పొందిన జిల్లా వాసులు
- తిరగబడిన కుమరం భీం
- నేడు తెలంగాణ విమోచన దినం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం పాలన విముక్తి పోరాటంలో ఆసిఫాబాద్ ప్రాంత సమర యోధుల పోరాటం మరువలేనిది. ఆసిఫాబాద్ ప్రాంతానికి చెందిన పలువురు మహారాష్ట్రలోని చంద్రాపూర్ మిటలరీ శిక్షణ క్యాంపులో చేరి సాయుధ శిక్షణను పొందారు. మిలటరీ పంజాబ్ రేజిమెంట్ లేజర్ పీఎస్ గహూన్ శిక్షణను అందించారు. అక్కడ క్యాంపు ఇన్‌చార్జి గోపాల్ శాస్త్రి బేకర్, బల్లార్షా క్యాంపు ఇన్‌చార్జిగా కేవీ కేశవులు వ్యవహరించగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఈ క్యాంపులకు వ్యూహకర్తగా వ్యవహరించారు. ఆసిఫాబాద్‌కు చెందిన చీల శంకర్, చీల విఠల్, కాంద్రె శంకర్, చందన్‌వార్ విఠల్, జగన్నాథ్, రేవయ్య, రాంసింగ్, నాగేంద్రయ్య, తిరుపతి, వెంకటేశంలు సాయుధ శిక్షణ శిబిరంలో ఏడాది పాటు శిక్షణ పొందుతూ సాయుధ పోరాటాన్ని నిర్వహించారు.

జిల్లా కేంద్రంగా ఆసిఫాబాద్..

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా 1940 వరకు కొనసాగింది. ఈ సమయంలో పలువురు బ్రిటీష్ పాలన వ్యతిరేక పోరాటం, వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమాలు, హిందీ మహాసభ ప్రచారం జరిపి జైలు జీవితం అనుభవించిన స్ఫూర్తితో 1947 నుంచి 1948 సంవత్సరాల్లో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తుపాకీ పట్టి పోరాటం చేసేందుకు బీజం పోసింది. ఆసిఫాబాద్ ప్రాంతం నుంచి చీల శంకర్, చీల విఠల్, రాంసింగ్, కాంద్రె శంకర్, రేవయ్య, నాగేంద్రయ్య, బోనగిరి వెంకటేశం, చందావార్ విఠల్, కాటెపల్లి తిరుపతి, జగన్నాథ్‌లు అజ్ఞాతంలోకి వెళ్లి మహారాష్ట్రలోని చాందలో నిర్వహించిన సాయుధ శిక్షణ శిబిరంలో ఏడాది కాలం పాటు శిక్షణ పొందుతూ వివిధ సంఘటనల్లో పాల్గొన్నారు. భారత సైనిక దళాలకు అండగా ఉంటూ ప్రాణాలకు తెగించి రణరంగంలో దూకిన ఆసిఫాబాద్ సమరయోధులు నిజాం లొంగు బాటుకు దరూర్ రైల్వే స్టేషన్ విధ్వంసం చేసిన సంఘటనలో పాల్గొన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో కలిపేందుకు అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లాభాయ్ పటేల్ ఆదేశాలతో 13.09.1948 పోలీసు యాక్షన్ ప్రకటితమైంది. మహారాష్ట్ర సైనిక దళాలు చాందా, బల్లార్షా క్యాంపుల్లో సుశిక్షితులైన ఆసిఫాబాద్ యోధులు రజాకార్లను మట్టుపెట్టేందుకు ముందుకు సాగారు. ఈ పోరాటం హోరాహోరిగా జరిగింది. సెప్టెంబర్ 14న బల్లార్షా సాస్రి ప్రాంతంలో జరిగిన పోరాటంలో 10 మంది నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు మరణించారు. సెప్టెంబర్ 15న సైనిక దళాలు మాణిక్‌ఘడ్ పోలీసు అవుట్ పోస్టుపై దాడి చేశారు. సెప్టెంబర్ 16న సిర్పూర్, బెజ్జూరు అవుట్ పోస్టులు భారత సైనిక పరమయ్యాయి. సెప్టెంబర్ 17న నిజాం సర్కార్ సైన్యానికి తలోగ్గి హైదరాబాద్ సంస్థాన్ భారత్‌లో విలీనం అయింది. సెప్టెంబర్ 18న ఆసిఫాబాద్ జిల్లా జైలులోని 200 మంది ఖైదీలు గేట్లు విరగొట్టుకుని బయటకు వచ్చారు. నిజాం ప్రభుత్వాన్ని భారత దేశ సంస్థానంలో విలీనం చేసేందుకు ఆసిఫాబాద్ సమరయోధుల కృషి ఎంతో ఉంది.

దోపిడీ వ్యవస్థ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాడు నిజాం నిలువు దోపిడీ వ్యవస్థ కొనసాగింది. రజాకార్ల అరాచకాలు పరాకాష్టకు చేరాయి. అరకపట్టి, మంచెపట్టి, బంచరాయి లాంటి పన్నులతో గిరిజన రైతులను దోచుకున్నారు. అడవి బిడ్డలకు అడవిపై హక్కులు లేవన్నారు. ఈ నేపథ్యంలో సాయుధ పోరుకు దిగిన కుమరం భీం నిజాంపై వీరోచితంగా పోరాడి వీర మరణం పొందారు. జిల్లా గిరిజనుల్లో పోరాట స్ఫూర్తి నింపారు. గిరిజన హక్కుల కోసం తిరుగుబాటు నేర్పారు. భీం పోరాట స్ఫూర్తితోనే ఈ ప్రాంతంలో వం దలాది మంది యువకులు నిజాంపై తుపాకీ ఎక్కు పెట్టారు.

జిల్లాలో గిరిజన హక్కుల పోరాటం, భారత స్వాతంత్ర్య పోరాటం, ప్రత్యేక తెలంగాణ పోరాటం చరిత్రలో ప్రముఖంగా నిలిచాయి. గొప్ప పోరాట నేపథ్యం ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య పోరాటంలో హైదరాబాద్ విలీనం పోలీసు యాక్షన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీతో పాటు వందలాది మంది సమర యోధులు పోరాడి భావితరానికి స్ఫూర్తిగా నిలిచారు.

బాపూజీ కల సాకారం..

భారత స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు నిజాం నిరంకుశత్వం నుంచి హైదరాబాద్ విలీన సాయుధ పోరులో కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రముఖ పాత్ర పోషించారు. పోరాట యోధుడు, ఆసిఫాబాద్ ప్రథమ శాసన సభ్యుడు కొండాలక్ష్మణ్ బాపూజీ ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని వాంకిడిలో 1915 సెప్టెంబర్ 27న జన్మించారు. ఆసిఫాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని రాజురాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య అభ్యసించారు. హైదరాబాద్‌లోని సిటీ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యూలేషన్ పూర్తి చేశారు. అక్కడే డిప్లొమా లా కోర్సులో చేరి 1945లో పూర్తి స్థాయి లా పట్టాను పొందారు. హైకోర్టు న్యాయవాదిగా పని చేశారు. 1952లో ఆసిఫాబాద్ నియోజక వర్గం నుంచి జనరల్ కోటా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్ర్య పోరు, నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడానికి జరిగిన పోరాటంలో ప్రముఖ పాత్ర పోశించిన వారిలో కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యుడు. 1969 నుంచి కొనసాగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. 2008 నవంబర్‌లో ఆయన ప్రత్యేక తెలంగాణను తమకు తాము ప్రకటించుకొంటామని సంచలన ప్రకటన చేశారు. 2009 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్రను పోషించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ సాయుధ సమితిని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాజకీయ జేఏసీ, టీఆర్ఎస్‌లతో ఇతర రాజకీయ పార్టీల విధానాలతో ఆయన విభేదించారు. నవ తెలంగాణ ప్రజాపార్టీని ప్రకటించారు. 96 ఏళ్ల వయస్సులోనూ ప్రత్యేక తెలంగాణ కోసం ఆయన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్షకు కూర్చున్నారు. 2012 సెప్టెంబరు 22న ఆయన మరణించే వరకు తెలంగాణ సాధన కోసం కృషి చేశారు.

ప్రజాపాలన దినోత్సవంగా..

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా పరిగణిస్తూ వేడుకలను నిర్వహిస్తోంది. జిలాలో ప్రజాపాలన దినోత్సతవాన్ని నిర్వహించేందుకు అధికారులు కలెక్టరేట్‌లో ఏర్పాటు పూర్తి చేశారు. జిల్లాకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

కెరమెరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం కుమరంభీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని జోడేఘాట్‌లో కుమరంభీం వర్ధంతిని పురుష్కరించుకొని మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి హెలిప్యాడ్, దర్బార్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ మేరకు పలు సూచనలు చేసి భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయలన్నారు. అక్టోబరు 7న నిర్వహించనున్న కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జోడేఘాట్‌లో శాశ్వతసభ వేదిక నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాట్టి నుంచి జోడేఘాట్ వరకు అవసరమైన బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలు, గూడాలలో నివాస గృహల నిర్మాణాలు, తాగునీటి పనులను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. అందరి సమన్వయంతో వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, ఈఈ తానాజీ, ఆడిషనల్ డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్, డీపీవో భిక్షపతిగౌడ్, డీడీ రమాదేవి, భీం మనుమడు సోనేరావు, ఎంపీడీవో అమ్జద్‌పాషా, ఉత్సవ కమిటీ సభ్యులు పెందోర్ రాజేశ్వర్, రాయిసెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కెరమెరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అగర్‌వాడ పాఠశాల, మోడి కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. కేజీబీవీ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఖాన్ అకాడమీ ద్వారా అందిస్తున్న విద్యబోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షిస్తూ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లాయితే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న బోజన తయారిలో నాణ్యమైన నిత్యావసర సరుకులు తాజా కూరగాయలను వినియోగించలన్నారు. పాఠశాలల పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఎంఈవో ప్రకాష్, ఎంపీడీవో అమ్జద్‌పాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర అభినందనీయం


ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానిస్తున్న ట్రస్మా సభ్యులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అభినందనీయమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. పట్టణంలోని విద్యాధరి హైస్కూల్‌లో జిల్లా ట్రస్మా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ట్రస్మా భవన నిర్మాణానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తామన్నారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, సలహాదారుడు శేఖర్ రావు మాట్లాడుతూ డిజిటల్ యుగంలో కూడా ఉపాధ్యాయుడికి చాక్‌పిస్ అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పరదేసి దేవభూషణం, రాష్ట్ర వర్కింగ్‌ప్రసిడెంట్ పెద్దపల్లి కిషన్ రావు, కార్యదర్శి తిరుపతి చారి, కోశాధికారి రాజేంద్రప్రసాద్;పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యం పై అప్రమత్తంగా ఉండాలని జీసీడీవో శకుంతల అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, వంటగదులు, పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌డబ్ల్యూవో శ్రీనివాస్, హెచ్‌ఎం దినకర్ ఉన్నారు.

జెండా ఆవిష్కరణ

ఆసిఫాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి బద్రీ సాయి జెండా అవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్ నాయకులు బద్రీ సత్యనారాయణ, చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉపేందర్, నాయకులు శంకర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

రెబ్బెన, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని బెల్లంపల్లి ఏరియా సివిల్ డీజీఎం ఎస్‌కె మదీనా భాషా అన్నారు. 92వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం గోలేటి సింగరేణి మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి పశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టన్ కిరణ్ పాల్గొన్నారు.

ఖమన కార్యదర్శిపై విచారణ

వాంకిడి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమన గ్రామ పంచాయతీ కార్యదర్శి పోశంపై మంగళవారం ఎంపీడీవో ఖాజా అజీజోద్దీన్ విచారణ జరిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పోశం ప్రతి విషయంలో డబ్బులు అడు గుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని ఖమన మాజీ ఎంపీటీసీలు ప్రవీణ్, గోల్ల, బీజేపీ నాయకుడు నరేష్, ఆదివాసీ సంఘం నాయకుడు రాము ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ డీవో విచారణ జరుపుతుండగా గ్రామస్థులు గ్రామపంచాయతీ కార్యలయంలో ఎదుట ఆందోళనకు దిగారు. ఈ కార్యదర్శి మా కొద్దు అంటు గ్రామస్థులు పట్టుపట్టారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రజలు హెచ్చరించారు. విచారణ జరిపి నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తానని ఎంపీడీవో ప్రజలకు చెప్పడంతో ఆందోళన విరమించారు.

కాగజ్‌నగర్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. పాటలీపుత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు కాగజ్‌నగర్‌లో మంగళవారం రైల్వే అధికారులు హాల్టింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యే పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రైల్ సేవా సమితి అధ్యక్షులు ప్రయాగ్ తివారి, పవన్ బల్దువా, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, మాజీ జడ్పీటీసీ నీరటి సత్యనారాయణ, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలుపదాసు శ్రీదేవి పాల్గొన్నారు.


పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

ప్రాణహిత నిర్మాణ బాధ్యత కాంగ్రెస్‌దే

కౌటాల , (ఆంధ్రజ్యోతి): ప్రాణహితను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్‌దే అని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత ప్రాజెక్టు ప్రారంభించక పోతే వచ్చే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్సీ దండే విఠల్ ఇటీవల ప్రకటించటంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై అపనమ్మకం వస్తోందని అన్నారు. 2008లోనే అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించినట్టు కొత్తగా ఇప్పుడు ప్రారంభించేది ఏమీ లేదన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు దోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు విజయ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎల్ములే మల్లయ్య, నీరటి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్నిప్రారంభించిన ఎమ్మెల్యే

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా విమల లైఫ్ కేర్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే హరీష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ దేవయ్య, తహసిల్దార్ ప్రమోద్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు దోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన, తిర్యాణి, బెజ్జూరు సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించినట్లు జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిర్యాణికి మునీశ్వరి, రెబ్బెన, బెజ్జూరు సమకార సంఘాలకు శామ్యూల్ మాథ్యూస్‌ను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 12 సహకార సంఘాలు ఉండగా మొదటి విడతగా ఏడు సంఘాలకు పొడిగిస్తూ ఇదివరకే ఉత్తర్వుల అందాయని తెలిపారు. తాజాగా ఆసిఫాబాద్, వాంకిడి సంఘాలకు పొడిగింపు వచ్చినట్లు తెలిపారు.

పనుల పరిశీలన

సిర్పూర్(టి), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. డోర్‌పల్లి, పారిగాం, లోనవెల్లి తదితర గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో


సిర్పూర్(టి)లో ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

సిర్పూర్(యు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం యూరియా కోసం సిర్పూర్(యు)-జైనూర్ రోడ్డుపై రైతులు బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రెండు బస్తాల యూరియా కోసం రెండు మూడు రోజులుగా ఇక్కడికి వస్తున్నామన్నారు.యూరియా మాత్రం తమకు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రోజు మొత్తం వేచి చూసినా 60 యూరియా బస్తాలు మాత్రమే రైతులకు అందించారని చెప్పారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో ఎస్సై రామకృష్ణ రైతులతో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి యూరియా పంపిణీకి ఏర్పాటు చేస్తామని ఎస్సై చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఎస్సై వ్యవసాయ అధికారులతో మాట్లాడడంతోపాటు జైనూర్ నుంచి వేలి ముద్రల యంత్రం తెప్పించి రైతులకు యూరియా పంపిణీ చేశారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. బాలాజీ అనుకోడ రైతు వేదిక వద్ద యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టగా రైతులు ఉదయం నుండే బారులు తీరుతున్నారు. ముందుగా టోకెన్లు రాయించుకున్న ఒక్కో రైతుకు కేవలం రెండు యూరియా బస్తాలు పంపిణీ చేస్తుండడంపై రైతులు ఆందోళన చేపట్టారు. పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేపట్టారు.

సిర్పూర్(టి) (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం అధికారులు యూరియా పంపిణీ చేపట్టారు. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. యూరియా పంపిణీకి ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు కౌంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్‌మండల అధ్యక్షులు అలంటీన్ అబ్దుల్లాతో పాటు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. దీంతో అధికారులు స్పందించి రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేశారు.


సిర్పూర్(యు)లో రైతులతో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం తెలిపారు. 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. అలాగే అవినీతి, ఆరోపణలు వస్తే వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా తనిఖీ బృంద సభ్యులు పలువురు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో 420 పనులకు గాను రూ.7.28 కోట్లతో పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. పలువురు సిబ్బంది రూ.31745 పంపిణీలో తప్పిదం జరిగినట్టు సభా దృష్టికి తెచ్చారు. వెంటనే ఈ డబ్బులను రికవరి చేయాలని జిల్లా గ్రామీణ అభివద్ధి అధికారి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కోట ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై ఎప్పకప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక బృంద ఎస్‌టీఎం వేణు అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం..

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సహకార సంఘం యూరియా పంపిణీ కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ ఆలీబీన్ అహ్మద్, ఏఓ మిలింద్, సీఈవో రమణ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపి, పీఎంపిలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం సరికాదని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జాడి దిలిప్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. సమావేశంలో తులసిదాస్, లక్ష్మణ్‌గౌడ్, వీరాచారి, నాందేవ్, సదానందం, నారయణ, కేదారిగౌడ్, వెంకన్న పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో కొనసాగుతున్న వివిధ పనులకు సంబందించిన ఎస్ఎస్ఆర్ రేట్లను పెంచే వరకు నిరసన కొనసాగిస్తామని తెలంగాణ ఎన్‌సీడీపీఎల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియోషన్ అధ్యక్షులు రవిందర్‌రెడ్డి విద్యుత్‌శాఖ ఎస్ఈ రాథోడ్ శేషారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియోషన్ సభ్యులు అంజయ్య, జహంగీర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): టీబీజీకెస్ గౌరవ అధ్యక్షురాలు కవిత కాంగ్రెస్ నాయకులపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదని గోలేటి ఐఎన్‌టీయూసీ గౌరవ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాధవకృష్ణ, సోకల శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గాంధీచౌక్ వద్ద జరిగే బతుకమ్మపండుగను ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీచౌక్‌లోని పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో రైల్వే ప్రయాణికులకు కల్పనకు రైలు సేవా సమితి కృషి చేస్తోందని అధ్యక్షులు ప్రయాగ్ తివారి తెలిపారు. మంగవారం స్థానిక రాజస్థాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు . సమావేశంలో సమితి కోశాధికారి పవన్ బల్దువా, అరుణ్ లోయా, పెద్ది హరిష్, సాయి పాల్గొన్నారు.

కౌటాల , (అంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం యూరియా కోసం వచ్చిన రైతులకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, డొంగ్రీ మధుకర్, అదే వసంత్, మనీష్, భీమయ్య, డబ్బాబాపు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (అంధ్రజ్యోతి): కులగణనలో కుటుంబ వివరాలను అన్‌లైన్‌లో ఎంట్రి చేసిన డేటాఎంట్రి అపరేటర్లకు డబ్బులు చెల్లించాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట అపరేటర్లు నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డేటాఎంట్రీ అపరేటర్లు రవి, అనిల్, ప్రణయ్, బిక్కాజీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు దాడిలో వృద్ధుడి మృతి


రాజారాం(ఫైల్)

బెల్లంపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రవీంద్ర నగర్‌లో జంగపల్లి రాజారాం(69) అనే వృద్ధుడు ఎద్దు దాడిలో మంగళవారం మృతి చెందాడు. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలంలోని బుదకుర్తి గ్రామానికి రాజారాం పని నిమిత్తం రవీంద్రనగర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఎద్దు ఒక్కసారిగా రాజారాం మీదకు వచ్చి కొమ్ముల తో కడుపులో పొడిచి విసిరింది. దీంతో పక్కనే ఉన్న కరెంటు స్తంభానికి బలంగా తాకడంతో రాజారాంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాల నెపంతో బెదిరించిన వారిపై కేసు

హాజీపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో మంత్రాల నెపంతో ఒక మహిళను దూషించి బెదిరించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు హాజీపూర్ ఎస్ఐ స్వరూప రాజు తెలిపారు. పెద్దంపేట గ్రామానికి చెందిన బండపల్లి గురువయ్య, దేవేంద్ర, తాడూరి గురువయ్య, శంకరవ్వ, రాజయ్యలు అదే గ్రామానికి చెందిన ఓ మహిళకు మంత్రాలు వస్తాయనే నెపంతో ఇంటికి వెళ్లి భూతులు తిట్టి చంపుతామని బెదిరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయమై బాధిత మహిళ కుమారుడు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. ఎటువంటి గొడవలు చేయకుండా ఉండేం దుకు తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పటిక, నల్ల బెల్లం పట్టివేత

దండేపల్లి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ అనే కిరాణ దుకాణంలో అక్ర మంగా నిల్వ ఉంచిన 60 కిలోల నల్ల బెల్లం, 240 కిలోల పటికను పట్టుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి తెలిపారు. నమ్మదగిన సమా చారం మేరకు మంగళవారం ఉదయం దుకా ణంలో తనిఖీ చేశారు. షాప్‌లో నిల్వ చేసిన ఉంచిన పటిక, బెల్లంను పట్టుకు ని స్వాధీనం చేసుకుని లక్షెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ శాఖ కార్యాల యానికి తరలించారు. అతడిపై కేసు నమోదు చేయడంతో పాటు డిప్యూటీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ గంగారెడ్డి వెల డించారు. దాడిలో లక్షెట్టిపేట ఎక్సైజ్ శాఖ ఎస్సై మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు

వాంకిడి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తున్న వాంకిడి మండలం సోనాపూర్ గ్రామానికి చెందిన కినక జంగు(45) అనే వ్యక్తి పది సంవత్సరాల జైలు శిక్ష రూ. 20వేలు జరిమానా విధిస్తు ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. కినక జంగు సోనాపూర్ గ్రామ శివారులోని పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు 17.01.2022లో అప్పటి ఎస్సై దీకొండ రమేశ్ తనిఖీ చేశారు. గంజాయి మొక్కలు దొరికడంతో అప్పటి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ జరిపి కినక జంగుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రస్తుత సీఐ సత్యనారాయణ, ఎస్సై మహేందర్ సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడు కినక జంగుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ. 20 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్‌మోహన్‌రావు, ఎస్పీ చిత్తరం జన్, సీఐ సత్యనారాయణ, ఎస్సై మహేందర్, కోర్ట్ లైజనింగ్ అధికారి రామ్‌సింగ్‌ను ఎస్పీ అభినందించారు.

వేతన కష్టాలు తీరేనా..?

- ఆరు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందుల్లో 104, ఔట్ సోర్సింగ్ సిబ్బంది

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి రావాల్సిన జీతం నెల నెల రాక పోవడంతో జిల్లాలో పని చేస్తున్న 104 సిబ్బంది, ఎంసీహెచ్ సిబ్బందితో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలుగా వేతనాలు ప్రభుత్వం నుంచి చెల్లించక పోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో వైద్య విధాన పరిషత్ విభాగం పరిధిలో పని చేస్తున్న 104 సేవలు అందించేందుకు 20 మంది సిబ్బంది, ఎంసీహెచ్-3, ఔట్ సోర్సింగ్‌లో 60 మంది సిబ్బంది పని చేస్తున్నారు.104 సిబ్బంది ప్రతీ నెల ప్రతి గ్రామంలో పర్యటించి సర్వేలు చేపట్టి గ్రామంలో వైద్య సేవలు ప్రాథమికంగా అందించే లక్ష్యంగా ఏర్పాటు చే సింది. ఆశయం బాగానే ఉన్నప్పటికీ వీరు సేవలు అం దిస్తున్నప్పటికీ వీరికి వేతనం మాత్రం రావడం లేదు.


ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

నిత్యం పనుల్లో..

నిత్యం పనుల్లో ఉండే సిబ్బందికి నెలనెలా వేతనాలు రాకపోవడంతో కుటుంబాల పోషణకు అవస్థలు పడుతున్నారు. ఆరు నెలల నుంచి వీరికి జీతాలు రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు నెల నెలా జీతాలు చెల్లించేలా చూడాలని అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ రావడం లేదని వాపోతున్నారు. అలాగే మదర్ కేర్ హెల్త్ విభాగంలో జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు కూడా గత ఆరు నెలల నుంచి జీతాలు రాలేదు. జిల్లాలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న పిల్లల కోసం ఫీజులు కట్టాల్సి ఉంటుందని, జీతాలు సక్రమంగా రాక పోవడంతో అవస్థల తప్పడం లేదని వాపోతున్నారు. వేతనాల కోసం ఆయా కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తుంటే అధికారులు తాము బిల్లులు పంపించామని, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారని పలువురు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.



ఆందోళన చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది (ఫైల్)

మున్సిపాలిటీలోనూ అదే పరిస్థితి..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోనూ పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల 154 మంది ఉండగా, వీరి పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. వీరికి కూడా నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. వారం రోజుల క్రితం ఎమ్మెల్సీ దండే విఠల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వేతనాల సమస్యను పరిష్కారించాలని కాంట్రాక్టు కార్మికులంతా కూడా తమ గోడను ఎమ్మెల్సీకి వివరించారు. వీరితో పాటు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు సైతం నెల నెల జీతాలు రాక తంటాలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒకరిపై కేసు

సిర్పూర్(యు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకడబోడ్డి గ్రామానికి చెందిన ఆత్రం ముత్త పత్తి చేనులో గంజాయి సాగు చేస్తుండడంతో మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆత్రం ముత్త తన పత్తి చేనులో 47 గంజాయి మొక్కలు పట్టుబడ్డాయని, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సంజయ్ అన్నారు. రెబ్బెనలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో మంగళవారం కళాబృందం ఆధ్వర్యంలో అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాల్యవివాహాలు, మాదక ద్రవ్యాలు గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్సై వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సీఐ, ఎస్సైని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం సభ్యులు శ్రీనివాస్, రోహిత, రాంచందర్, రజిత, సంఘవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని శాసనమండలి డిప్యూటి ఛైర్మన్ బండ ప్రకాష్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి:

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు చేట్టావలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాడ్ వ్యాదులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోజుకు 400కు పైగా వివిధ వైద్యసేవల నిమిత్తం రోగులు వస్తుంటారని అందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాడ్ పరీక్షలు నిర్వహించి పాజిటివ్ కేసులను గుర్తించాలని చిన్నకారణాలతో ఇతర ప్రాంతాలకు రోగులను పంపించడం సరికాదన్నారు. వారికి ఇక్కడే వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులకు వారికి అందిస్తున్న వైద్య సేవలు పాజిటివ్ వచ్చిన కేసులను ప్రతి రోజు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి సీతారాం, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య


లక్ష్మి(ఫైల్)

మందమర్రిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన పిట్టల లక్ష్మి (65) అనే వృద్ధురాలు తన నివాసంలోని మంగళవారం తెల్లవారుజామున బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం తెల్లవారు జామున కాలకృత్యాలకు అని బయటకు వచ్చి బావిలో దూకింది. లక్ష్మీ కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. నిద్ర నుంచి బయటకు వెళ్లిన లక్ష్మీ ఎంతకు రాకపోవడంతో భర్త చుట్టుపక్కల వెతుకగా సమీపంలో ఉన్న బావిలో ఉండడంతో వెంటనే కుమారులకు తెలియజేశారు. కుమారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రాజశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. లక్ష్మీ డయాబెటిక్‌తో బాధపడుతోందని, జీవితంపై విరక్తి చెందిన బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గతంలో పెద్ద కుమారుడు కిడ్నీ సమస్యతో చనిపోయాడని అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో మంచం పట్టిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్ల పరిశీలన

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఈ నెల 18న హాల్టు కానున్న వందేభారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌రైలు సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపట్టనుండడంతో మంగళవారం ఎమ్మెల్యే హరీష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిబ్బందికి సూచనలు చేశారు.

రైతులకు అన్నదానం


రైతులకు భోజనం పెడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

పెంచికలపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మంగళవారం యూరియా బస్తాలు రావడంతో వివిధ గ్రామాల నుంచి బారీ సంఖ్యలో రైతులు చేరుకున్నారు. ఎస్సై అనిల్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి రైతులను వరుస క్రమంలో ఉండాలని సూచించారు. ఉదయం నుంచి రైతులు అకలి కడుపుతో అలమటిస్తూ యూరియా కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రైతులతో మాట్లాడారు. రైతుల ఇబ్బందులను గుర్తించి రైతువేదిక సమీపంలో యూరియా రైతుల కోసం ప్రత్యేక అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వయంగా తానే భోజనం వడ్డించి రైతుల ఆకలి తీర్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, రాజన్న నాయకులు తిరుపతి, సాజిద్, రామన్న, కొండన్న, రమేష్, నరేష్, సాయి పాల్గొన్నారు.

యాజమాన్యం కొత్త బొగ్గు గనులను ప్రారంభించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ నూతన బొగ్గు గనులను ప్రారంభించాలని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి, సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్, శాంతిఖనిగనిలో గల జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ సంఘాల నాయకత్వంలో పోరాటాలకు పీడిత ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశం బహిష్కరణతో కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సీఎండీతో జరగాల్సిన స్ట్రక్చర్ సమావేశం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బహిష్కరించడంతో కార్మికులకు అన్యాయం జరిగిందని ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకులు ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు స్ట్రక్చర్ సమావేశంలో పాల్గొనకపోవడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. యాజమాన్యంతో కొట్లాడి కార్మికుల హక్కులు సాధించాల్సి ఉండగా, ముందుగానే చేతులెత్తేయడం సరికాదని చెప్పారు. దీనివల్ల లాభాల వాటా, నూతన గనులు ఏర్పాటు, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, మెడికల్ బోర్డు బాధితులకు న్యాయం చేయడం, బదిలీ పాలసీ రద్దు, విజిలెన్స్, మారుపేర్ల కేసు వంటి సమస్యలు పరిష్కారం కాకుండా పోయాయన్నారు. కార్మికుల పక్షానే కాకుండా తమ యూనియన్ అధికారుల పక్షాన కూడా ఉందనడానికి తమ అధినేత జనక్ ప్రసాద్ పీఆర్‌పీ ఫైలుపై సంతకం చేయించడం నిదర్శనమన్నారు. మారుపేర్లు, విజిలెన్స్ బాధితులతో సింగరేణి సీఎండీ ఎన్.బలరాంకు వినతిపత్రం ఇప్పించి వారి సమస్య పరిష్కరించాలని కోరామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమై సింగరేణి పక్షాన కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించాలని కోరామని చెప్పారు. వేలంలో పాల్గొని నూతన గనులు పొందాలని విన్నవించామని తెలిపారు. మెడికల్ బోర్డుకు వెళ్లిన ప్రతి ఒక్కరిని ఇన్‌వ్యాలిడేషన్ చేయాలని, 100 రోజుల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, లాభాల వాటాపై వెంటనే ప్రకటన చేసి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావే శంలో నాయకులు గరిగె స్వామి, సీహెచ్. భీంరావు, ఏనుగు రవీందర్ రెడ్డి, పేరం రమేష్, తిరుపతి రాజు, భీం రవి, తదితరులు పాల్గొన్నారు.



బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలి


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలని కార్పొరేట్ జీఎం (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) ఎ మనోహర్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఏప్రిల్ 2026 నుంచి మార్చి 2027 వరకు శ్రీరాంపూర్‌లోని వివిధ గనులు సాధించాల్సిన ఓబీ లక్ష్యాలను నిర్దేశించేందుకు కార్పొరేట్ టార్గెట్ కమిటీ ఏరియాను సందర్శించింది. అనంతరం జీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జీఎం (ఉపరితల గనులు) సూర్యనారాయణరాజు, జీఎం(భూగర్భ గనులు) రఘురాంరెడ్డి, ఐ అండ్ పీఎం శ్రీహరి, ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఏరియా కమిటీ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ ఏరియా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏరియా ఉపాధ్యక్షుడిగా బండి రమేష్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం కార్యదర్శులుగా మహిపాల్ రెడ్డి, భాస్కర్, సంతోష్, కుమారస్వామి, ఉత్తేజ్ రెడ్డి, బుస్స రమేష్, తోంగల రమేష్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, తిరుపతిరావు, రమేష్, శ్రీనివాస్ చారి, మల్లేష్, వినయ్, క్రాంతి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజేశం, సంపత్, రవీందర్, రమేష్, నరసింహ స్వామి, మల్లికార్జున్, రాజిరెడ్డి, అనిరుధ్, అశోక్, ముఖ్య సంయుక్త కార్యదర్శులుగా దేవేందర్, తిరుపతి రెడ్డి, కోశాధికారిగా జగదీష్‌తో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సత్తయ్య, రమేష్, అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీల్లో ప్రతిభ చాటాలి


మాట్లాడుతున్న ఎస్ఓటు జీఎం విజయ్‌ప్రసాద్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కబడ్డీ క్రీడాకారులు కోలిం డియా పోటీల్లో ప్రతిభ చాటి పతకం సాధించాలని మందమర్రి ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్ అన్నారు. సింగరేణి పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన ఏరియా వార్షిక క్రీడల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణిలో క్రీడాకారులకు కొదవలేదని అన్నారు. వారు ఎంచుకున్న క్రీడల్లో అద్భుతంగా రాణిస్తున్నా రని తెలిపారు. ఒక వైపు ఉద్యోగులుగా బొగ్గు ఉత్పత్తి సాధనకు కృషి చేస్తూనే వారు ఎంచుకొన్న క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ఈసారి కోలిండియా పోటీల్లో సింగరేణి సత్తా చాటాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పోటీలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికార సంఘం అధ్యక్షులు రమేశ్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తిక్, స్పోర్ట్ కోఆర్డినేటర్ శివ క్రిష్ణ క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా సింగరేణి పా ఠశాల మైదానంలో నిర్వహించిన కార్మిక కబడ్డీ పోటీల్లో కాసిపేట-2 గ్రూపు విజేతగా నిలిచింది. ఈ గ్రూపుకు చెందిన క్రీడాకారులు అద్భుత క్రీడా ప్రదర్శన చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు. కాసిపేట-1 గ్రూపు రన్నర్‌గా నిలిచింది.

సీఈఆర్ క్లబ్‌లో వైద్య శిబిరం

రెబ్బెన, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపలి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, గ్రామస్థులకు పరీక్షలకు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథ మహర్షి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తగిన చకిత్స తీసుకోవడం వల్ల నయమవుతాయవని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాల వాటాను ప్రకటించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాల వాటా ప్రకటించకపోవడం సరికాదని, వెంటనే ప్రకటించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకనటలో డిమాండ్ చేశారు. గత నెల 24న బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం జరిగినప్పటికీ లాభాలను ప్రకటించకపోవడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. లెక్కలు తారుమారు చేసి కార్మికులకు తక్కువ వాటా ఇచ్చే ప్రయత్నంలో యాజమాన్యం మునిగి ఉందని పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం ఉద్యోగులకు అన్యాయం చేస్తే తాము చూస్తూ ఊరుకునేది లేదని తెలిపారు.. రెండు రోజుల క్రితం సింగరేణి సంస్థ ఫండ్‌ను 146.70 కోట్ల రూపాయలను రాష్ట్రంలోని 33 జిల్లాలకు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం, యాజమాన్యం సంయుక్తంగా ప్రకటన చేయడం సరికాదని తెలిపారు. సీఎస్ఆర్ నిధులను కంపెనీకి సంబంధం లేని సివిల్స్ అభ్యర్థులకు అందించడం నిబంధనలు అతిక్రమించడమేనని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్స రంలో సుమారు 6 వేల 393 కోట్ల రూపాయలు లాభాలు వచ్చినట్లుగా స్పష్టమవుతోందని చెప్పారు. గాంధీ జయంతి, దసరా ఒకేరోజు వస్తున్నందున దసరా సెల వును 3వ తేదీకి మార్చాలని కోరారు. ఆయా డి మాండ్లను నెరవేర్చని పక్షంలో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

రిటైర్డ్ ఉద్యోగుల నిరసన


అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు సంస్థ అభివృద్ధికి పని చేసిన రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు రాము రవీందర్, రేణిగుంట కొమురయ్య, బొలిశెట్టి రాజయ్యలు మాట్లాడుతూ పెన్షన్ పెంపుదల చేపట్టాలని కోల్‌కత్తలోని పెన్షన్ కార్యాలయం వద్ద ఆలిండియా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారని తెలిపారు. ఆ ధర్నాకు సంఘీభావంగా సింగరేణి వ్యాప్తంగా రిటైర్డ్ ఉద్యోగులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో తుంగపల్లి శంకర్, దాసరి ఎల్లారం, రాంటెంకి సమ్మయ్య, కల్వల లచ్చన్న, దాసరి శంకర్, పప్పాల రవి, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు చేస్తే భయపడేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


కోటపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలిస్తే తాము భయపడేది లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం కోటపల్లిలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుమన్ చెన్నూరుకు మొదటిసారి వచ్చిన సందర్భంగా ఆ మీటింగ్‌ను చూసి తట్టుకోలేక అధికార పార్టీ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ప్రస్తుతం రైతులు యూరియా కోసం గగ్గోలు పెడుతుంటే దీన్ని పట్టించుకోకుండా నియోజక వర్గంలో అభివృద్ధిని అటకెక్కించి ప్రజాపాలన పేరిట అభివృద్ధిని మర్చిపోయి రైతులు అవస్థలు పడుతుంటే దీనికి మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులను మంగళవారం పోలీస్‌స్టేషన్‌లకు తరలించి అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని ప్రజల పక్షాన పోరాడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిన్నారం మాజీ సర్పంచు గజ్జెల చందు, మండల సోషల్ మీడియా వారియర్ బాపునాయక్, రాజ్‌కుమార్ యాదవ్, అనిల్, నూతన్, మాంతయ్య పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలపై దృష్టి సారించిన మంత్రి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. ఈమేరకు నాయకులు, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మూడు మున్సిపాలిటీల్లోని ప్రధాన సమస్యలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులుగా నియోజకవర్గంలోని క్యాంపు కార్యాలయంలో వార్డులు, గ్రామాల వారీగా సమస్యలు తెలుసుకుంటున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులకు సమస్యలను తెలుసుకుని నిధులకు సంబంధించి వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. కోటపల్లి, భీమారం, జైపూర్, చెన్నూరు, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాటీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. మరో రెండు రోజుల్లో రైతులకు యూరియా అందేలా చూస్తానని తెలిపారు.


ఒత్తిడి

తట్టుకోలేక పోతున్నారా..



చిన్నచిన్న సమస్యలకే నేలరాలుతున్న విద్యార్థులు

ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు



- బెల్లంపల్లికి చెందిన ఓ విద్యార్థిని తొమ్మిదో తరగతి చదువుతోంది. చదువుకోవడం ఇష్టం లేక రెండు రోజులుగా బడికి వెళ్లడం లేదు. దీంతో పాఠశాలకు వెళ్లాలని ఒత్తిడి చేయడంతో తనువు చాలించింది.
- నస్పూర్‌కు చెందిన ఓ పదో తరగతి విద్యార్థిని పదిలో జీపీఎస్ వస్తాయోరావోనని మమ్మీడాడీ నన్ను క్షమించు అంటూ సూసైడ్‌నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడింది.
- జూన్ 25న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్వప్న మృతికి కారణాలు కూడ తెలియవు. చదువులో ఒత్తిడి తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడిందేమో అని కొందరి అభిప్రాయం.
- నస్పూర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని సెకండియర్ ఫెయిల్ అయ్యానని మన స్థాపంతో ఇంట్లోనే ఉ రివేసుకొని తనువు చాలించింది.
- దండేపల్లికి చెందిన విద్యార్థి ఇంటర్ పూర్తి చేయగా బీటెక్ చదవడం ఇష్టం లేదంటూ పైచదువులకు వెళ్లనంటూ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు.
- మంచిర్యాల పట్టణం బైపాస్ రోడ్డులోని మిమ్స్ కళాశాల భవనం పై నుంచి లక్షెట్టిపేట చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.
- మంచిర్యాల పట్టణం హమాలీవాడకు చెందిన ఎంపీసీ మొదటి సంవత్సరం చదు వుతున్న మిట్టపల్లి శివాని వరంగల్ ఎస్ఆర్ కళాశాలలో అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె వద్ద అమ్మనాన్న చెల్లిని బాగా చూసుకో బాగా చదివించండి. కాలేజీలో మంచి గ్రూపు తీసుకోమను నాలాగా అర్థం కాని చదువు వ ద్దు. దాన్ని మంచిగా చదివించండి అంటూ దొరికిన సూసైడ్ నోటు కలకలం రేపింది.
- బెల్లంపల్లికి చెందిన బీటెక్ విద్యార్థి సెమిష్టర్‌లో తక్కువ మార్కులు వచ్చాయని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఇవీ జిల్లాలో కొద్ది రోజులుగా కలకలం సృష్టిస్తున్న విద్యార్థినుల ఆత్మహత్యలు.

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా చదువుకోవడం లేదనో పరీక్షల్లో ఫెయిల్ అవుతామనో చదువుకుంటే ఉద్యోగం వస్తుందో రాదోననో కుటుంబం నుంచి చదువుపై ఒత్తిడి భవిష్యత్‌పై ఎక్కువగా మదనపడడం, అనారోగ్యం, చదివినా అబ్బడం లేదని మానసికంగా కుంగిపోవడం, వివిధ కారణాలతో తీవ్రమైన ఒత్తిడికి గురై డిప్రెషన్‌లోకి వెళ్లి కొందరు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. క్షణికావేశంతో తీసుకుంటున్న నిర్ణయాలు కన్నవారికి తీవ్ర కడుపుకోత మిగులుస్తున్నాయి.

తలకిందులవుతున్న తల్లిదండ్రుల అంచనాలు

పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలు తలకిందులవుతున్నాయి. పిల్లలు చదువులో రాణించి మంచి స్థాయిలో ఉండాలని కన్న వారు కోరుకోవడం సహజమే. కానీ ఆ అంచనాలే పిల్లల మానసిక స్థితిని దెబ్బతీస్తున్నాయనేది విద్యార్థినుల ఆత్మహత్యలను బట్టి అర్థమవుతోంది. చిన్న చిన్న కారణాలతోనే ఒంటరిగా ఉంటూ వారికివారే మనోవేదనకు గురవుతున్నారు. వచ్చిన సమస్యలను స్నేహితులకుగాని, బంధవులకు గాని అమ్మనాన్నలకు గురువులకు గాని చెప్పుకోని సమస్య పరిష్కారానికి ప్రయత్నించకుండానే కఠిన నిర్ణయం తీసుకుంటున్నారు.

దెబ్బతీస్తున్న సోషల్ మీడియా

కరోనా సమయంలో విద్యార్థులు సోషల్ మీడియాకు ఆకర్షితులు కావడం వారిలో డిప్రెషన్ పెరగడానికి కారణమని పరిశోధనలు చెబుతున్నాయి. ఎక్కువగా మొబైల్‌కు బానిసలవడం కూడ విద్యార్థుల్లో చదువులో వెనుకబడడం అనుకున్న అంచనాల ప్రకారం మార్కులు రాకపోవడం వంటి కారణాలతో ఆత్మహత్యలకు గురవుతున్నారు.



చిన్న చిన్న విషయాలకే ఒత్తిడి పెంచుకుని..

ఆత్మహత్యాయత్నం చేసిన వారిలో ఎక్కువగా నిద్ర లేకపోవడం చిన్న విషయాలకు ఎక్కువగా ఆలోచించి ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. మనసులో తెలియకుండా ఆందోళన చెందడం, చిన్న విషయాలకు భయపడుతుండడం వంటి లక్షణాలను గుర్తించి స్నేహితులుగాని, బంధువులుగాని వారి పట్ల కొంత అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఆత్మహత్యలను నివారించవచ్చనేది వైద్యుల అభిప్రాయం.

సమస్యకు పరిష్కారం...

డాక్టర్ సునిల్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు



పాఠశాలలో విద్యార్థులందరిని ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలి. నిద్ర, తిండిలేకుండా రోజుల తరబడి ఎవరితోని మాట్లాడకుండా మూడి ఉండడాన్ని గమనించాలి. అలాంటి వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులు అవసరమైన సహకారం అందించాలి. వారిని పట్టించుకోకుండా అలాగే వదిలేస్తే ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటారు. అవసరమైతే మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తే ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కవచ్చు.

ఘనంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకలు



బెల్లంపల్లిలో కేక్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గడ్డం వినోద్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. క్యాంప్ కార్యాలయంలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతారి స్వామి, నాయకులు సూరిబాబు, మల్లయ్య, శంకర్, రాంచందర్, బండి ప్రభాకర్, రమేశ్‌లు పాల్గొన్నారు.

వేమనపల్లి : నీల్వాయి గ్రామంలో కేక్ కట్ చేశారు. వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సాబీర్, మధు, లింగాగౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

భీమిని : మండల కేంద్రంలో కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంచి పెట్టారు. మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, జగదీష్, సతీష్, ప్రసాద్, సింగతి రామన్న, సంజీవ్, నవీన్ పాల్గొన్నారు.

నెన్నెల: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదినోత్సవాన్ని మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విద్యార్థులకు ప్లేట్లు, హాస్టల్ పిల్లలకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. నెన్నెల సీహెచ్‌సీకి అవసరమైన నెబ్యూలైజర్ అందించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు హరీష్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు మల్లాగౌడ్, శ్రీనివాస్, సాంబమూర్తిగౌడ్, బానేష్, శంకరయ్య, ఎండీ నజీర్, తిరుపతిరెడ్డి, శ్రీమతిదేవి, సంధ్య పాల్గొన్నారు.

పోలీసుల కళాజాతా

నస్పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పోలీస్ స్టేసన్ పరిధిలోని సంఘ మల్లయ్య పల్లెలో సోమవారం రాత్రి మూఢ నమ్మకాలు, గంజాయి తాగడం, మహిళా జరుగుతున్న నేరాలు, సీజనల్ వ్యాధులు తదితర వాటిపై పోలీస్ కళాజాతా బృందం ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిం చింది. గంజాయి తాగడం వలన కలిగే దుష్ప్రభావాలు, మూఢ నమ్మకాలు, మహిళలపై జరుగుతున్న నేరాలపై, గృహహింస, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు కళాకారులు ఆటపాటలు, కళారూపాల ద్వారా స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్‌రావు మాట్లాడుతూ గంజాయి తాగడం వలన ఆరోగ్యాలు దెబ్బతిని ఆర్థికంగా నష్టం కలుగుతుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు సదనందం, పోలీస్ కానిస్టేబుల్స్, కళాకారులు పాల్గొన్నారు.

అతివలే అధికం..

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల కోసం ముసాయిదా కింద తీసుకున్నారు. వాటిపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లు ఉన్నారు. వీరిలో స్త్రీలు 1,91,011 మంది ఉండగా, పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఓటర్లు ఉన్నారు.

50 శాతం సీట్లు మహిళలకే...

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రకారం మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తారు. ఇవే గాకుండా మిగతా 50 శాతం సీట్లలో జనరల్ కేటగిరీకి కేటాయించే స్థానాల్లో మహిళలు పోటీ చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీచేసి, గెలిచిన మహిళల సంఖ్య అధికంగానే ఉంది. వచ్చే ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు జనరల్ స్థానాల్లో కూడా కొందరు మహిళలను రంగంలోకి దింపాలని ఆయా పార్టీల ముఖ్య నేతలు భావిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ మహిళా ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయిస్తున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు గ్రామాల్లో ఎక్కువగా మహిళలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే ప్రభుత్వం కూడా మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం ఉపాధి కోసం యూనిట్లు మంజూరు చేస్తూ రుణాలు అందజేస్తోంది. ఆర్టీసీ అద్దె బస్సుల్లో మహిళలను పాత్రదారులను చేయడం, పెట్రోల్ బంకుల ఏర్పాటు, తదితర పథకాలు ప్రత్యేకంగా రూపొందిస్తోంది. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం, ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేరిట ఇవ్వడం ద్వారా వారికి పెద్దపీట వేస్తోంది. అధికార పార్టీతోపాటు ప్రతి పక్ష పార్టీల నాయకులు సైతం మహిళల ఓట్లపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం మించి రిజర్వేషన్లు కల్పించరాదనే

ప్లేట్లు, గ్లాసులు అందజేత

దండేపల్లి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట చెందిన శ్రీ శివసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో దండేపల్లి మండలం నంబాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు స్టీల్ పల్లెం, గ్లాసులను మంగళవారం సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంజిత్, శ్రీశివసాయి గణేష్ సేవ సమితి ప్రధానకార్యదర్శి పెట్టెం తిరుపతి, కార్యదర్శి వినోద్‌శర్మ, ప్రసన్నమ్మ, ధనలక్ష్మి, లావణ్య, కవిత, సౌజన్య, శైలాజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవల్లో ముందుండాలి

నెన్నెల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 108 అంబులెన్స్‌ల ద్వారా రోగులు, క్షతగాత్రులకు సత్వర సేవలు అందించడంలో సిబ్బంది ముందుండాలని 108 అంబులెన్స్ల జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్ సూచించారు. మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల నమోదు, బాధితుల ఫోన్ కాల్స్‌పై సిబ్బంది స్పందన, వైద్య సేవాలు, సేవల్లో వేగం గూర్చి అడిగి తెలుసుకున్నారు. వాహనం కండీషన్, ప్రథమ చికిత్సకు అందించే మందులు, పరీక్షించారు. జిల్లా ఈఎంఈ సంపత్, హెడ్ ఆఫీస్ ఆడిటర్ కిషోర్ ఉన్నారు.

భీమిని : మండల కేంద్రంలో 108 వాహనాన్ని మంగళవారం రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ డిపార్టుమెంట్ అధికారి కిషోర్ తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సంపత్ ఉన్నారు. సిబ్బంది పని తీరుపై సంతృప్తివ్యక్తం చేశారు. ఆ కార్యక్రమంలో అంబులెన్స్ సిబ్బంది సారయ్య, రాకేష్, ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

స్వర్ణ పతకం సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థి

కాసిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న జనగామ జిల్లా కూనూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కాసిపేట మోడల్ స్కూల్ విద్యార్థి జక్కుల అశ్విన్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ అబ్దుల్ కలీల్ తెలిపారు. అండర్ 14 విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అశ్విన్ ప్రాతినిధ్యం వహించాడు. అన్ని విభాగాల్లోప్రతిభ కనబర్చి జట్టును ప్రథమ స్థానంలో నిలిపి స్వర్ణ పతకం సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు,పీఈటీ శ్రీనివాస్ గౌడ్ అభినందించారు.

సాగుకు అవసరమైన యూరియాను పంపిణీ చేస్తాం

కలెక్టర్ కుమార్ దీపక్



భీమారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

భీమారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో మాట్లాడారు. భీమారం మండలంలో గత సంవత్సరం 14 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించబడిందని, ఈ సంవత్సరం ఇప్పటికే 11 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని తెలిపారు. ఇంకా మండలంలో అవసరం ఉన్న ప్రకారం 3, 4 రోజుల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం భీమారంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. అనంతరం కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించారు. తరగతి గదులు, రిజిష్టర్‌లు, వంటశాల, సామగ్రి భద్రరిచే గది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం, శుద్ధమైన నీటిని అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలను బోధించాలన్నారు. వంట సిబ్బంది పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అత్తె సుధాకర్, ఏఈవో అరుణ్‌కుమార్, ఎస్ఐ శ్వేత, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలు భేఖాతరేనా..?

● అమ్మవారి ఉత్సవాల షెడ్డు తొలగింపు ● మున్సిపల్ కమిషనర్‌పై విమర్శల వెల్లువ



మంత్రికి ఇచ్చిన వినతి పత్రాన్ని చూపుతున్న నిర్వాహకులు

చెన్నూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాలు ఇచ్చినా షెడ్డును తొలగించడంతో కమిషనర్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ఆస్నాద రోడ్డు కాలనీ వాసులు వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆస్నాద రోడ్డు ప్రాంతంలో షెడ్డును ఏర్పాటు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసినా షెడ్డును తొలగించడం లేదంటూ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. నిర్వాహకులు మాత్రం త్వరలోనే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఉన్నాయని, అప్పటి వరకు అనుమతి ఇవ్వాలని కోరారు. కమిషనర్ అందుకు అంగీకరించలేదు. ఈ విషయంపై నిర్వాహకులు మంగళవారం మంత్రి వివేక్‌వెంకటస్వామికి దుర్గాదేవి నవరాత్రులు ముగిసే వరకు షెడ్డుకు అనుమతులు ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంపై మంత్రి సంతకం చేసి ఇది మున్సిపల్ కమిషనర్‌కు ఇవ్వాలని కోరారు. దీంతో నిర్వాహకులు వెళ్లి కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చినా షెడ్డును కూల్చివేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

మంత్రి సంతకం చేసిన వినతి పత్రానికే విలువ లేదని పలువురు చర్చించుకున్నారు.

సాయుధ పోరాట ఘనత కమ్యూనిస్టులదే

దండేపల్లి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన నాటికి పుట్టని పార్టీలు నేడు సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నాయని సీపీఐ మండల కార్యదర్శి పేర్క రాజేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రమణరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మంగళవారం దండేపల్లిలో సీపీఐ జెండాను ఎగురవేశారు. కారక్రమంలో లక్షెట్టిపేట సీపీఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం, నాయకులు పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంగలవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్యా మొగిలి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శంకర్, ఆనంద్, శివరావు, రాంచందర్, శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగమల్లయ్య

కాసిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోడల్ స్కూల్ పీజీటీ ఉపాధ్యాయుడు అందె నాగమల్లయ్యను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కొట్టెశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగ మల్లయ్యకు యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని పాత వరిపేటకు చెందిన ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు నర్ర తిరుపతి జిల్లా కార్యదర్శిగా నియమించారు.

మంత్రి వివేక్ పరామర్శ

మందమర్రిటౌన్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి సదానందం యాదవ్ తల్లి అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులను అడిగి ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



సదానందం తల్లిని పరామర్శిస్తున్న మంత్రి వివేక్

సల్పలవాగు ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకు రావాలి

కాసిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల క్రితం పది కోట్ల రూపాయలు ఖర్చు చేసి కోమటిచేను సమీపంలో నిర్మించిన సల్పలవాగు ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాసుదేవ్ భారీ నీటి పారుదల శాఖ మంత్రి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. 22 ఏళ్ల క్రితం నిర్మించిన సల్పలవాగు ప్రాజెక్టు వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని, ప్రాజెక్టులో నీరు నిండా ఉన్నా కాలువలు నిర్మించకపోవడంతో సమీప భూములు బీడు భూములుగా మారుతున్నాయన్నారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి కాలువలు నిర్మించి వినియోగంలోకి తీసుకువస్తే 3200 ఎకరాలు సస్యశ్యామలంగా మారుతాయన్నారు. మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలన్నారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టుకు..

మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక


కోటపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన విద్యార్థి జి.విష్ణు ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. రెండు రోజుల క్రితం కాసిపేట గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 19 వాలీబాల్ జట్టు సెలక్షన్‌లో విష్ణు అత్యంత ప్రతిభ కనబర్చి జట్టు సభ్యునిగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరుపున ఆడుతాడని తెలిపారు. మంగళవారం విద్యార్థి విష్ణును పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, పీఈటీ రాజయ్యలు జ్ఞాపిక అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ జీఎం సమీక్షా సమావేశం

గోదావరిఖని, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో మంగళవారం ఆర్‌జీ-1, 2, 3, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల సెక్యూరిటీ అధికారులతో సింగరేణి జీఎం (సెక్యురిటీ) సీహెచ్ లక్ష్మీనారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని, విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏరియాలో అవసరమైన స్థలలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడటంలో ఎస్ అండ్‌పీసీ చురుకుగా ఉండాలని, అదే విధంగా ఎస్‌అండ్‌పీసీ డిపార్ట్‌మెంట్‌లో రానున్న రోజులలో చేపట్ట వలసిన ప్రణాళికల గురించి చర్చించారు. ఆర్‌జీ-1, 2, 3, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల సెక్యురిటీ అధికారులు వీరారెడ్డి, షరీఫ్, షబీరుద్దీన్, జక్కారెడ్డి, రవి, శ్రీధర్ పాల్గొన్నారు.

రావణ దహనాన్ని అడ్డుకుంటాం

బెల్లంపల్లి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): దసర రోజున పట్టణంలోని తిలక్ స్టేడియం లో రావణ దహనాన్ని అడ్డుకుంటామని దళి త సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. మంగళవారం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వారు మాట్లాడుతూ రావణ సురిని దహనం పేరుతో బీజేపీ, ఆర్ఎస్ ఎస్, హిందూ ఉత్సవ కమిటీ వారు రాజకీయాలు చేస్తున్నారన్నారు. రావణసురిని దహనం పేరుతో వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రావణసురున్ని కాల్చడం దళితుల మనో భావాలను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు రావణసురుని దహన కార్యక్రమానికి అనుమతులు ఇవ్వవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంబాల రాజేశ్, చిలుక రాజనర్సు, రత్నం ఐలయ్య, హరి, నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సలహాదారుకు స్వాగతం



ప్రభుత్వ సలహాదారుకు పూలమొక్క అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్

నస్పూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొనేందుకు మంగళవారం రాత్రి నస్పూర్‌కు చేరుకున్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావుకు ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఏసీపీ ప్రకాష్, నస్పూర్ తహసీల్దార్ సంతోష్ మొక్కను అందించి స్వాగతం పలికారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం


మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జరిగే వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ అతిథిగాపాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సందేశం ఇస్తారన్నారు.

11 మంది పీఏసీఎస్ చైర్మన్ల తొలగింపు

మంచిర్యాల. సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16మంది పీఏసీఎస్ చైర్మన్లను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు సైతం జారీ అయినట్లు తెలుస్తోంది. ఒకేసారి ఇంత మందిని తొలగించడం సంచలనం కలిగిస్తోంది. చెన్నూర్, కోటపల్లి, భీమిని, జెండా వెంకటాపూర్, నెల్కివెంకటాపూర్, పద్దన్‌పల్లి, గూడెం, ఇటిక్యాల, జైపూర్, నెన్నెల, మందమర్రి చైర్మన్లను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దాదాపు పది అంశాల్లో విచారణ చేపట్టిన అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. కొన్నిచోట్ల యూరియా, వ్యవసాయ పరికరాల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డట్టు అధికారుల విచారణలో తేలినట్లు తెలిసింది. పీఏసీఎస్ చైర్మన్ల పదవీ కాలం ముగియడంతో ఇటీవలే ప్రభుత్వం ఆరు నెలల పాటు పొడిగించింది. అంతలోనే వారిని తొలగించడం పట్ల తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

చెన్నూరు: చెన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్ల రామిరెడ్డిని తొలగించినట్లు ఆశాఖ జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. పాలక మండలి సభ్యులందర్నీ తొలగించినట్లు తెలిపారు.

అతివలే అధికం..



'స్థానిక' ఎన్నికల్లో మహిళా ఓటర్లే ఎక్కువ...

- గెలుపోటముల్లో కీలక భూమిక వారిదే
- జిల్లాలో 3.76 లక్షల ఓటర్లు
- పురుషుల కంటే ఐదు వేలు అధికంగా స్త్రీలు
- 15 మండలాల్లో ఆమెదే ఆధిపత్యం

మండలాల వారీగా ఓటర్ల వివరాలు...

మండలం	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు
బెల్లంపల్లి	23464	11625	11838	01
భీమిని	11529	5844	5684	01
భీమారం	13093	6394	6699	00
చెన్నూర్	26475	13040	13435	00
దండేపల్లి	42101	20486	21614	01
హాజీపూర్	16954	8361	8593	00
జైపూర్	30626	15278	15347	01
జన్నారం	44412	21670	22740	02
కన్నెపల్లి	15490	7614	7875	01
కాసిపేట	26472	13127	13342	03
కోటపల్లి	26990	13320	13668	02
లక్షెట్టిపేట	25227	12261	12966	00
మందమర్రి	11482	5678	5803	01
నెన్నెల	19371	9636	9734	01
తాండూర్	27757	13741	14016	00
వేమనపల్లి	15226	7568	7657	01
మొత్తం	376669	185643	191011	15

మంచిర్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా మహిళాఓటర్లే కీలక భూమిక పోషించనున్నారు. ఇటీవల ప్రకటించిన గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఓటర్ల జాబితాలో పురుషులకంటే మహిళలు ఐదువేలపై చిలుకు అధికంగా ఉన్నారు. జిల్లాలోని 16మండలాలకు గాను 15మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. భీమిని మండలం మినహా మిగతా అన్ని మండలాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలతో మహిళలకు పెద్దపీట వేస్తుండగా, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సైతం వారిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

కాగా జిల్లాలో మొత్తం 16మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఎంపీటీసీ స్థానాలు 129, జడ్పీటీసీ స్థానాలు 16, ఎంపీపీ స్థానాలు 16 ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలోని 306 గ్రామ పంచాయతీలలో వార్డుకు ఒక పోలింగ్ బూత్ చొప్పున ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని మొత్తం 306 గ్రామ పంచాయతీల పరిధిలో 2,680 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డుకు ఒకటి చొప్పున పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను ఆగస్టు 28న జారీ చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ నెల 2వ తేదీన తుది జాబి తాను వెల్లడించారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 6వ తేదీని ముసాయిదాను ప్రదర్శించగా, అభ్యంతరాల గడువు అనంతరం 10వతేదీన తుది జాబితాను ప్రదర్శించారు. పంచాయతీ ఎన్నికల తుది జాబితానే మండల, జిల్లా పరిషత్..

(తరువాయి 7లో)

ఎస్టీపీపీలో ఉత్సాహంగా తీజ్ పండుగ



తీజ్ పండగలో క్లబ్ సభ్యులు

జైపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) :ఎస్టీపీపీలోని లేడీస్ క్లబ్‌లో హరియాలి తీజ్ పండగను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు సుమిత శ్రీనివాసులు, గౌరవాధ్యక్షురాలు శివకు మారిచిరంజీవి హాజరయ్యారు. లేడీస్ క్లబ్ మహిళలు రాధాకృష్ణులు, అమ్మవారి వివిధ రూపాలు లక్ష్మీదేవి, ఎల్లమ్మతల్లి, సేవాలాల్ వంటి మూర్తులను విభిన్నరకాలుగా అలంకరించి పూజించారు. అనంతరం మహిళలకు ఆటలు, తీజ్‌క్వీన్, ఫ్యాషన్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు మాట్లాడుతూ తీజ్ అనగా గోధుమ మొలకలు అని అర్థమని, తీజ్ పండగ అనేది వివాహిత స్త్రీలు తమ భర్తల దీర్ఘాయిష్షు కోసం జరుపుకునే ముఖ్యమైన పండగ అని తెలిపారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. క్లబ్ సెక్రటరీగా నీలిమ, వరలక్ష్మీ, భాగ్యలక్ష్మీలను నియమించారు. తీజ్ క్వీన్‌గా లహరి ప్రియ, శ్రావణలక్ష్మీ, రజనీలు గెలుపొందారు. ఆటల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు స్రవంతి వేణుగోపాల్, నీలిమపంతుల, పద్మమోహన్‌సింగ్‌లు పాల్గొన్నారు..

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్

లక్షెట్టిపేట, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లక్షెట్టిపేట మున్సిపల్‌కమిషనర్ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం లక్షెట్టిపేట పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాల, కళాశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. క్యాంపస్‌లోని కిచెన్‌తో పాటు పరిసరాలు పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు సలహాలు అందజేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో క్యాంపస్ ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం క్యాంపస్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పట్టణంలోని 12వ వార్డును మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి. ఆరీఫ్‌తో కలిసి పరిశీలించారు. ఈకార్య క్రమంలో ప్రిన్సిపల్ మంగ, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ రాజేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాకేష్, వైస్ ప్రిన్సిపల్ తిరుమల్, డిడబ్లు వాణితో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అడవులతో మానవాళికి మనుగడ



వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీవో రామ్మోహన్

దండేపల్లి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అడవులతోనే మానవాళికి మనుగడ సాధ్యమని వైల్డ్‌లైఫ్ ఇన్స్పెక్టర్, వన్యప్రాణి నేరాల నియంత్రణ బ్యూరో ఆదిమల్లయ్య, జన్నారం ఎఫ్‌డివో రామ్మోహన్ పేర్కొన్నారు. దండేపల్లి మండలం తాళ్లపేట అటవీరేంజ్‌సెక్షన్ పరిధిలోని కుంటలగూడ గిరిజన గ్రామంలో మంగళవారం గిరిజనులకు వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మానవ మనుగడకు దోహదపడే అడవులు జీవవైవిధ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. పక్షులు, జంతువులు, వివిధ రకాల కీటకాలకు అవాసాలుగా మారిన అడవులు అంతరించిపోతే అనర్థాలు చోటు చేసుకునే అవకాశాలు న్నాయన్నారు. మాన వాళి మనుగడకు అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని, దీంతో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సాగు చేసిన పంటలకు దోహదం చేస్తాయన్నారు. ప్రతీ ఒక్కరు అడవులతో పాటు వన్య ప్రాణులను సంరక్షించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం గిరిజనులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాళ్లపేట డిప్యూటి రెంజ్ అధికారిణి సాగరిక, ఎఫ్‌బీవో పద్మజరాణి, గిరిజనులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకుందాం



తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూల మాల వేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బీమనాథుని సుదర్శన్, సలేంద్ర సత్య నారాయణలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద తెలంగాణ సాయుధపోరాట అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 17వరకు గ్రామస్థాయి నుంచి పట్టణ కేంద్రాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఐ పోరాట చరిత్ర ప్రజలందరికీ తెలుసునని, ప్రజల కోసమే పుట్టిన పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దుర్గ రాజు, బండారి రాజేశం, మల్లయ్య, బియ్యాల పద్మ, శర్మ, ఎగ్గడి రాజేశ్వర్‌రావు, సీవీ రమణ, వెంకటేశ్వర్లు, రసూల్, సమీందర్, వీరన్న, గోపాల్, సంతు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది సాహసం.. చెరువులోకి వెళ్లి మరమ్మతు పనులు

నెన్నెల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆవడం విద్యుత్ సిబ్బంది సాహసం చేశారు. ట్యూబ్ సాయంతో చెరువులో వెళ్లి మరమ్మతులు చేపట్టి రెండు గ్రామాలకు కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. సోమవారం రాత్రి భారీ వర్షానికి జెండావెంకటాపూర్ గ్రామ సమీపంలో గోపాల్ చెరువులోని స్థంబంపై తీగ తెగి నీటిలో పడిపోయింది. దీంతో జెండావెంకటాపూర్, శ్రావన్‌పల్లి గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో మంగళవారం లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజన్న అక్కడికి చేరుకున్నారు. చెరువు నిండా నీరుండీ మధ్యలో స్థంబం ఉండటంతో రిపేరు చేయడం కష్టంగా మారింది. ట్యూబ్ సాయంతో స్థంబం వద్దకు చేరుకొని గంట పాటు శ్రమించి తీగలను సవరించారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజన సంక్షేమ శాఖ డైలీవేజ్ వర్కర్లు

నస్పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్‌వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్స్ డైలీవైజ్‌వర్కర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ఎదుట వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె నోటీస్‌ను డీటిడివో కార్యాలయంలో ఏవోకు అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు దుంపల రంజిత్‌కుమార్, కొడప మధునమ్మలు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు సమాన పనికి సమానజీతం చెల్లించాలన్నారు. గిరిజన హాస్టల్స్ వర్కర్లందరికి టైంస్కెల్ ఇవ్వాల న్నారు. బుధవారం నుంచి సమ్మెబాట పట్టు తున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ అధి కారులు సమ్మెకుమద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు చల్లారి దేవదాస్, నాయకులు భీమయ్య, భాంరావు, లక్ష్మన్, లక్ష్మీ, భాగ్య, సత్తక్క, లలిత, సంధ్య, శకుంతల హాస్టల్స్ వర్కర్లు పాల్గొన్నారు.

వేతన కష్టాలు తీరేనా..?

- ఆరు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందుల్లో 104, ఔట్ సోర్సింగ్ సిబ్బంది

6



ఒత్తిడి తట్టుకోలేక పోతున్నారా..

- చిన్నచిన్న సమస్యలకే నేల రాలుతున్న విద్యార్థులు
- ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు



7

నేడు గూడెం ఆలయ హుండీ లెక్కింపు

దండేపల్లి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెంగుట్ట శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నేడు స్వామివారి హుండీ సొమ్మును లె క్కిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలి పారు. అధికారుల, ఈవో, ఆలయ ముఖ్య అర్చకులు, అర్చకుల పర్యవేక్షణలో బుధ వారం ఉదయం 10గంటలకు ప్రధానాల యంలో హుండీ లెక్కిస్తామన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో

నస్పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీ సింగరేణి అతిథి గృహంలో ఉమ్మడి జిల్లా అటవీ శాఖ అధికారులకు వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, సదరన్ రీజియన్ చెన్నై, తెలంగాణ అటవీ విభాగం సంయుక్తంగా రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అటవీశాఖ అధికారులకు వన్యప్రాణు లను వేటాడిన వ్యక్తుల గుర్తింపుతో పాటు కారణమైన వారికి శిక్ష పడేలా అన్ని ఆధారాలను పకడ్బందీగా సేకరించే విధంగా సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో మంచిర్యాల ఎఫ్‌డీవోలు శర్వేశ్వర్, మంచిర్యాల ఎఫ్ఆర్‌వో రత్నాకర్ రావు, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో అబ్దుల్ అజార్‌లతో పాటు ఉమ్మడి జిల్లాలోని అటవీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ నాయకపోడ్‌లు హక్కులకోసం ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని ఆదివాసీ నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గంజిరాజన్న, జిల్లాఅధ్యక్షుడు భూమేష్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చార్వాకట్రస్టుహాల్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగా జరుగుతున్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ముందుకు సాగాలన్నారు. జాతి అవసరాలకోసం తప్ప వేరేవారికి జాతినితాకట్టు పెట్టవద్దన్నారు. వచ్చే నెలలో జిల్లాలో బహిరంగ సభను ఏర్పాటు చేసి ప్రభుత్వానికి ఆదివాసీ నాయకపోడ్‌ల స్థితిగతులను తెలియ జేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజన్న, అవోక్, సంజీవ్, మోహన్, కొమురయ్యరమేష్ పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



నీల్వాయిలో యూరియా కోసం రోడ్డుపై బైఠాయించిన రైతులు



కాసిపేటలో పోలీసుల సహకారంతో యూరియా పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

వేమనపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం వేమనపల్లి మండల రైతులు నీల్వాయి గ్రామంలోని సహకార సంఘం కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డుపై మంగళవారం బైఠాయించి ఆందోళన చేపట్టారు. పంటల దిగుబడికి ఉపయోగపడే యూరియా కావాలంటూ ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోవడంతో రైతులు అధికారులను నిలదీశారు. సుమారు 2 గంటలకు పైగా రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నెలల తరబడి యూరియా కావాలని వ్యవసాయాధికారులను అడిగినా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా అందించడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్ మాట్లాడుతూ రైతులకు యూరియా అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బం దులకు గురి చేస్తోందన్నారు. ప్రస్తుతం వరి, పత్తి పంటలకు యూరియా అత్యవసరం అయి నప్ప టికీ రైతులకు యూరియా దొరకడం లేదన్నారు. రైతులు రోడ్డుపై అందోళన చేయడంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న నీల్వాయి ఎస్ఐ కోటేశ్వర్ సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వీరన్న రెండురోజుల్లో రైతుల యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు కుబిడె వెంకటేశం, బాపు, రమేష్‌గౌడ్, రాజలింగు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ

కాసిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత 15 రోజులుగా రైతులను యూరియా కొరత వేధిస్తుండగా మంగళవారం 266 యూరియా బస్తాలు మండల కేంద్రానికి చేరుకున్నాయి. మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్య యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఒక రైతుకు ఒక పాస్‌బుక్ ఆధారంగా ఒకయూరియా బస్తాను అందించారు. దీంతో రైతులకు కొంతఊరట లభిం చింది. మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ మాట్లాడుతూ మరో రెండురోజుల్లో 532బస్తాల యూరియా మండలానికి రానుందని, రైతులు యూరియాకోసం ఆందోళన చెందవద్దన్నారు. యూరియా కొరతను అధిగమించేందుకు ప్రణాళికలతో పనిచేస్తున్నామన్నారు.